మంచాల ఏవోగా మాధవీలత

మంచాల, ఆగస్టు 23: మంచాల మండల వ్యవసాయ శాఖ అధికారిగా శుక్రవారం మాధవీలత బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ సాగులో రైతులకు ఎలాంటి సందేహాలు, సూచనల కోసం, రైతు రుణమాఫీ కాని వారు రైతు వేదికలో ఏఈవోలను సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

సమావేశంలో మాట్లాడుతున్న మండల విద్యాధికారి

చేవెళ్లటౌన్, ఆగస్టు 23: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని మండల విద్యాధికారి సయ్యద్ అక్బర్ సూచించారు. చేవెళ్ల నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో చదివే విద్యార్థులకు అండర్14, అండర్ 17జోనల్ స్థాయి క్రికెట్ పోటీలను చేవెళ్ల మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణంలో మండల విద్యాధికారి అక్బర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్ల నియోజకవర్గంలోని చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి మండలాల నుంచి 25పాఠశాలల విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారని, నైపుణ్యం కలిగిన విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. క్రీడలు మానసికోల్లాసాన్ని అందిస్తాయన్నారు. కార్యక్రమంలో జోనల్ సెక్రటరీ ప్రభాకర్, ఉపాధ్యాయులు సామాజిక వేత్త ఆశీర్వాదం, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, సీఆర్పీ కృష్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సవాలను జయప్రదం చేయండి

కడ్తాల్, ఆగస్టు 23: మండల కేంద్రంలో శనివారం నుంచి నిర్వహించే బోనాల ఉత్సవాలను విజయవంతం చేయాలని బోనాల ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. మండల కేంద్రంలోని పోచమ్మదేవత ఆలయంలో బోనాల ఉత్సవాలకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఉత్సవాలను పురస్కరించుకొని మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి రూ.1,00,116 విరాళాన్ని శుక్రవారం ఉత్సవ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు రోజులపాటు బోనాల ఉత్సవాలు కొనసాగుతాయని, ఆలయాల వద్ద పారిశుధ్య నిర్వహణకు పంచాయతీ అధ్వర్యంలో చర్యలు చేపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ సత్యంయాదవ్, సభ్యులు రాములు, నరేందర్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్, రాములుయాదవ్, కార్తీక్, యాదయ్య, వెంకటేశ్, సోమరాజు వెంకటయ్య, శ్రీనివాస్, వెంకటేశ్, బాలరాజు పాల్గొన్నారు.

సినీ డైరెక్టర్‌కు పరామర్శ

సినీ డైరెక్టర్ లక్ష్మణ్‌ను పరామర్శిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి వాసుదేవరెడ్డి

మంచాల, ఆగస్టు 23: తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో తీసిన బందూక్ చిత్రానికి డైరెక్టర్‌గా పనిచేసిన లక్ష్మణ్ మురారి తల్లి శెట్టి రాములమ్మ ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి శుక్రవారం మంచాల గ్రామంలో ఉన్న లక్ష్మణ్ మురారిని పరామర్శించి రాములమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన వెంట విద్యార్థి విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పి.రాజ్‌కుమార్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రాజేశ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కడ్తాల్, ఆగస్టు 23: మండల కేంద్రానికి చెందిన సిద్ధిగారి జంగయ్య అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వివిధ రాజకీయ, యువజన సంఘాల నాయకులు జంగయ్య మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి రూ.5 వేలు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి రూ.4 వేలు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్ రూ.3 వేలు ఆర్థిక సాయం అందజేశారు. వారి వెంట మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ లాయక్‌అలీ, నాయకులు రామచంద్రయ్య, వెంకటేశ్, కృష్ణ, జహంగీర్‌బాబా, శ్రీను, జంగయ్య, శ్రీకాంత్, రమేశ్, శ్రీశైలం, అంజయ్య, పారేశ్ పాల్గొన్నారు.

సీఎం ఆర్ఎఫ్ ఎల్ఓసీ అందజేత



ఎల్ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా

ఆర్కేపురం, ఆగస్టు 23 : మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఓల్డ్ బాలాజీనగర్‌లో నివాసముండే శ్యామ్‌రావు కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఆస్పత్రిలో చేరగా అందుకుగాను రూ.5లక్షలు ఖర్చు అవుతుందని బాధితుడికి చెప్పారు. దీంతో శ్యామ్‌రావు కాంగ్రెస్ నాయకుడు బేర బాలకిషన్‌ను సంప్రదించడంతో ఈ విషయాన్ని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా దృష్టికి తీసుకెళ్లడంతో శ్యామ్‌రావుకు సీఎం ఆర్ఎఫ్ నుంచి రూ.2,50,000 మంజూరు చేయించిన ఎల్ఓసీని శుక్రవారం అందజేశారు.

కొండుర్గులో మినీ స్టేడియం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

మినీ స్టేడియాన్ని నిర్మించే స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, ఆగస్టు 23: కొండుర్గు మండల కేంద్రంలో మినీ స్టేడియం, ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. శుక్రవారం కొండుర్గు మండల కేంద్రంలో మినీ స్టేడియం, ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మించే స్థలాలను పరిశీలించారు. మిని స్టేడియానికి ఇప్పటికే నిధులు మంజూరయ్యాయని, నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టు ద్వారా సకల సదుపాయాలతో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను నిర్మిస్తున్నామని వివరించారు. అదేవిధంగా కొండుర్గు మండల కేంద్రం మీదుగా నాలుగు లేన్ల రోడ్డు అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులను పరిశీలించారు. పనులను త్వరగా పూర్తిచేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పురుషోత్తంరెడ్డి, మల్లేశ్, జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకుడు దేవేందర్‌యాదవ్, కౌన్సిలర్ సోమ్లా నాయక్

అట్టహాసంగా ఫలహారపు బండి ఊరేగింపు

కొత్తూరు, ఆగస్టు 23: మున్సిపాలిటీలో రెండో రోజు మైసమ్మ, ఎల్లమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఇందులలో భాగంగా విశ్వశాంతియూత్ ఆధ్వర్యంలో పోచమ్మ ఆలయం నుంచి మైసమ్మ ఆలయం వరకు ఫలహారపు బండి ఊరేగింపు అట్టహాసంగా నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించారు. ఈ జాతరలో మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్య పాల్గొని అమ్మవారికి పూజలు వేశారు. పోతరాజుల విన్యాసాలు, శివసత్తులు ఆట పాటలు పలువురిని ఆకట్టున్నాయి. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు దేవేందర్‌యాదవ్, కౌన్సిలర్ సోమ్లానాయక్ విశ్వశాంతి యూత్ క్లబ్ అధ్యక్షుడు నాగరాజు శర్మ, సభ్యులు రవీందర్‌యాదవ్, కుమార్‌యాదవ్, శ్రవణ్‌యాదవ్, రాజూయాదవ్, లక్ష్మణ్‌రెడ్డి, నరసింహాయాదవ్, గణేశ్ యాదవ్, భాస్కర్‌యాదవ్, గూడెం యాదయ్యగౌడ్, పెంటయ్యయాదవ్, సరేందర్, వేణుగోపాలచారి పాల్గొన్నారు.

బస్ సర్వీసులను నడపాలి

బస్టాండ్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

షాద్‌నగర్‌టౌన్, ఆగస్టు 23 : విద్యాసంస్థల సమయవేళల్లో బస్ సర్వీసులు వేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. షాద్‌నగర్ ఆర్టీసీ డిపో ఎదుట శుక్రవారం విద్యార్థులతో కలిసి ధర్నా చేశారు. ఈ ధర్నాకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనూనాయక్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి చదువు కోసం షాద్‌నగర్‌కు వచ్చే విద్యార్థులు సమయానికి బస్సు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు సంబంధిత అధికారులు విన్నవించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. విద్యాసంస్థల వేళల్లో బస్సులను నడిపేలా చర్యలు తీసుకోవాలని డిపో మేనేజర్ ఉషను కోరారు. కార్యక్రమంలో నాయకులు భగత్, మాన, లహరి, సాత్విక, షాలిని, వినోద్, తరుణ్, ఆకాశ్, రాము, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనులు కూల్చివేత

కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

నెర్రపల్లి గ్రామపంచాయతీ ఎదుట ధర్నాకు దిగిన ప్లాట్ల యజమానులు

గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ప్లాట్ల యజమానులు

ఇబ్రహీంపట్నంరూరల్, ఆగస్టు 23 : మండల పరిధలోని నెర్రపల్లి గ్రామంలో సర్వే నంబర్ 64, 65, 67, 70 భూమిలో ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా నిర్మాణాలు కూల్చివేసిన పంచాయతీ కార్యదర్శితో పాటు ఇతర అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ...శుక్రవారం ప్లాట్ల యజమానులు, నాగన్‌పల్లి గ్రామస్తులు గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ప్లాట్ల యాజమానులు మాట్లాడుతూ.. 2004 సంవత్సరంలో గ్రామపంచాయతీ పర్మిషన్ ద్వారా ఏర్పాటు చేసిన వెంచర్‌లో పూర్తి అనుమతులతో ప్లాట్లు కొనుగోలు చేసిన రిటైర్డ్ ఉద్యోగుల ప్లాట్లల్లో అప్పటి భూ యజమానులు బెదిరింపులకు పాల్పడుతూ...పంచాయతీ కార్యదర్శి ద్వారా వేధింపులకు గురిచేస్తూ...నిర్మాణం చేపడుతున్న పనులు పూర్తిగా కూల్చివేసి లక్షల్లో నష్టం చేకూర్చారని, మాకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, కనీసం చెప్పకుండా నిర్మాణాలు కూల్చివేయించిన పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి వీణను వివరణ కోరగా.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్మాణాలు కూల్చివేయించానని, నిర్మాణ పనులకు సంబంధించి ఎలాంటి అనుమతులు తీసుకోలేదని తెలిపారు.

ఎల్ ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన వేగవంతం

బడంగ్‌పట పరిధిలో ఎల్ఆర్ఎస్ స్థలాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్, రెవెన్యూ అధికారులు

బడంగ్‌పేట, ఆగస్టు 23 : మహేశ్వరం నియోజక వర్గంలో గతంలో ఎల్ఆర్ఎస్ కోసం చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి క్రమ బద్ధీకరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో బడంగ్‌పట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 47,789 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించడానికి 4టీములను ఏర్పాటు చేశారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో 3,412 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దరఖాస్తులను పరిశీలించడానికి 3టీములను ఏర్పాటు చేశారు. జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో 10,892 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని పరిశీలించడానికి 3 టీములను ఏర్పాటు చేశారు. తుక్కుగూడ మున్సిపాలిటీలో 2,541 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. దరఖాస్తులను పరిశీలించడానికి 2 టీమ్‌లను ఏర్పాటు చేశారు. మున్సిపల్, రెవెన్యూ అధికారులు, ఇరిగేషన్ అధికారులు అందరు కలిసి సమన్వయంతో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పారదర్శకంగా పరిశీలించి క్రమ బద్ధీకరణ చేయాలని ఆదేశాలు జారీచేశారు. ప్రభు త్వం నిబంధనల ప్రకారం ప్రభుత్వం ఇచ్చిన గడువులోపు ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను క్లియర్ చేయడానికి అధికారులు వేగం పెంచారు.

పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి

కందుకూరు, ఆగస్టు 23 : ప్రభుత్వ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని టీఎస్‌సీపీఎస్‌ఈయూ రంగారెడ్డి జిల్లా కోశాధికారి ఎండీ బషీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భోజన విరామ సమయంలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన తెలిపారు. నేదునూరు ప్రభుత్వ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు 28 జీఓ గుదిబండగా మారిందని తెలిపారు. దీన్ని రద్దు చేసి నూతన పెన్షన్ విధానాన్ని తక్షణమే తొలగించాలని కోరారు. దీని వల్ల వల్ల తీవ్ర నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ శర్మ, విజయ, మోహన్‌రెడ్డి, సురేశ్, గ్లోరీ, కౌసల్య, కరుణాకర్, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.



నేదునూరు ప్రభుత్వ పాఠశాలలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డికి ఘన సన్మానం



డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న సింగల్‌విండో చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా

ఆమనగల్లు, ఆగస్టు 23: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీబీ చైర్మన్‌గా శుక్రవారం ఎన్నికైన విష్ణువర్ధన్‌రెడ్డిని ఆమనగల్లు సింగల్‌విండో చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌గుప్తా డీసీసీబీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. సింగల్‌విండోల ద్వారా సహకారబ్యాంకుల ద్వారా రైతులకు అందే రుణాలను అర్హులైన ప్రతి రైతుకు అందే విధంగా కృషిచేయాలని కోరినట్లు డీసీసీబీ డైరెక్టర్ తెలిపారు.

ఘన వీడ్కోలు

ఏఈవో జ్యోతిశ్రీ, సరితలను సన్మానిస్తున్న అధికారులు

మంచాల, ఆగస్టు 23: మంచాల వ్యవసాయ శాఖ అధికారులుగా పనిచేసిన ఏఈవో జ్యోతిశ్రీ, ఏఈవో సరిత బదిలీపై వెళుతుండగా శుక్రవారం మంచాల రైతు వేదికలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారిని వివిధ పార్టీల నాయకులు, అధికారులు ఘనంగా సన్మానించారు.

ట్రస్ట్ సేవలు విస్తరిస్తాం

కడ్తాల్ : నియోజకవర్గంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సేవలను మరింత విస్తృత పరుస్తామని ట్రస్ట్ అధినేత, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ అన్నారు. శుక్రవారం తలకొండపల్లి మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లి గ్రామంలో ట్రస్ట్ ఆధ్వర్యంలో, ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం కామినేని దవాఖాన ఆధ్వర్యంలో వైద్యులు అఖిల్, అనిల్ పర్యవేక్షణలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 416 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటయ్యాయాదవ్, గౌడ సంఘం తాలుకా కన్వీనర్ అశోక్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రాఘవేందర్, కృష్ణ, ఆంజనేయులు గౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, మైసయ్య, పాపిరెడ్డి, కృష్ణయ్య, రేణు రెడ్డి, నాగరాజు, చెన్నయ్య, బుచ్చిబాబు, అంజయ్య, భాస్కర్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ..

అంగన్‌వాడీ టీచర్‌తో మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ కవిత

మాదన్నపేట, ఆగస్టు 23 : సైదాబాద్, కుర్మగూడ లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో డిప్యూటీ తహసీల్దార్ కవిత అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వం అందజేస్తున్న సన్నబియ్యం విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. అధికారి ప్రదీప్ పాల్గొన్నారు.

ఘనంగా స్పేస్ డే

పెద్దఅంబర్‌పేట, ఆగస్టు 23: అంతరిక్షం అంటే ఏమిటి? అంతరిక్ష ప్రయోగాలు ఎలా చేస్తారు? ఇప్పటివరకు భారత దేశం చేసిన ప్రయోగాలు ఏమిటీ? వాటి విజయంతో చేకూరిన ప్రయోజనాలు ఏమిటి? ఇంకా ఎలాంటి ప్రయోగాలు చేయబోతున్నాం? ఇలా ఎన్నో అంశాలపై చర్చకు అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుత్బుల్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికైంది. శుక్రవారం పాఠశాలలో స్పేస్ డేను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎన్ఆర్ఎస్సీ, ఇస్రో శాస్త్రవేత్త టి.సంతోషి హాజరై అంతరిక్ష ప్రయోగాలు, వ్యోమగాముల గురించి విద్యార్థులకు వివరించారు. అంతరిక్ష ప్రగతి అనే అంశంపై పోస్టర్ తయారీ పోటీలతోపాటు విద్యార్థులకు స్పేస్‌పై క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఇస్రో శాస్త్రవేత్త సంతోషి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జగదీశ్, ఉపాధ్యాయులు కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

చెంచుల భూ సమస్యలను పరిష్కరించాలి

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామేశ్వరిదేవి

కడ్తాల్, ఆగస్టు 23: చెంచులు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి రామేశ్వరీదేవి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరం, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు మండలంలోని చెంచు నాయకులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. మండలంలో ఎన్ని చెంచు కుటుంబాలు ఉన్నాయి, ఉపాధి ఎలా పొందుతున్నారు, ఏయే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి తదితర విషయాలను అధికారులు నాయకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీటీడీవో మాట్లాడుతూ ఆదివాసీ చెంచులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, పీఎం జన్-మన్ కార్యక్రమంలో సంక్షేమ పథకాలను అమలు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డులు లేని వారికి వాటిని అందిస్తామని పేర్కొన్నారు. అలాగే చెంచులకు పక్కా గృహాలను నిర్మించి, ఆయుష్మాన్ భారత్, లేబర్, ఈజీఎస్ జాబ్ కార్డులు పంపిణీ చేస్తామన్నారు. చెంచు సంఘం జిల్లా నాయకుడు రాములు మాట్లాడుతూ చెంచులు సాగు చేసే భూములకు కరెంట్ స్తంభాలు, కాలనీల్లో వీధిలైట్లను ఏర్పాటు చేయాలని కోరారు. చెంచుల భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు చెంచుల కాలనీల్లో ఇంటింటికి వెళ్లి సమస్యలను తెలుసుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో ఎంపీడీవో సుజాత, జిల్లా ఎస్టీ కార్పొరేషన్ లోన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, విద్యుత్ శాఖ ఏఈ నరేందర్, మిషన్ భగీరథ ఏఈ శ్రావ్య, చెంచు నాయకులు రాములు, కృష్ణయ్య, రమేశ్, శ్రీశైలం, మహేశ్, అంజయ్య, శ్రీను, లింగయ్య, మల్లేశ్, పెంటయ్య పాల్గొన్నారు.

పలువురికి ఆర్థికసాయం అందజేత

ఇబ్రహీంపట్నంరూరల్, ఆగస్టు 23 : గ్రామంలోని పేదలకు అండగా ఉంటానని బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, మాజీ సర్పంచ్ రాంరెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఉప్పరిగూడ గ్రామంలో శుక్రవారం యువతి వివాహానికి క్వింటాల్ బియ్యం, రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. వారి వెంట మాజీ ఉపసర్పంచ్ నర్సింహారెడ్డి, గ్రామస్తులు వెంకటేశ్, శ్రీనివాస్, హరికృష్ణ, బుగ్గరాములు ఉన్నారు.

పడమటి తండాలో..

మాడ్గుల : మండల పరిధిలోని పలుగుతండా గ్రామ పంచాయతీ పరిధిలోని పడమటి తండాకు చెందిన జాటావత్ మధు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పీఏసీఎస్ డైరెక్టర్ కల్లు రాజవర్ధన్‌రెడ్డి మృతుడి కుటుంబాన్ని పరామర్శించాడు. అనంతరం తన వంతుగా రూ. 3వేల ఆర్థిక సాయం, ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేశ్ పంపిన రూ.3వేలను మృతుడి తండ్రికి అందజేశాడు. వారితో పాటు జాటావత్ శర్మ, లాలు, మోతియా, హరి ఉన్నారు.

చంద్రధన గ్రామంలో..

కడ్తాల్ (తలకొండపల్లి) : తలకొండపల్లి మండల పరిధిలోని చంద్రధన గ్రామానికి చెందిన ముసిలి శ్రీశైలం అనారోగ్యంతో బాధపడుతూ, హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం దవాఖానలో చికిత్స పొందుతున్న శ్రీశైలాన్ని పరామర్శించాడు. అనంతరం బాధితుడి భార్య చెన్నమ్మకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి అందించిన రూ.5 వేలు, గ్రామ కమిటీ తరుపున సమకూర్చిన రూ.5వేలు అందజేశారు. పరామర్శించిన వారిలో మాజీ ఎంపీటీసీ రాములు, రాజేందర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, రాఘవేందర్ ఉన్నారు.

చోరీలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

ఎస్ఐ మారయ్యకు ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్ బద్దం ప్రేం, కాలనీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి

ఎల్బీనగర్, ఆగస్టు 23 : సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గౌ తంనగర్, న్యూ గడ్డిఅన్నారం కాలనీల్లో రాత్రి సమయాల్లో జరుగుతున్న చోరీలను, కాలనీ వీధుల్లో హాస్టల్‌కు చెందిన యువతీయువకుల న్యూసెన్స్‌ను అరికట్టాలని కోరుతూ గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేంమహేశ్వర్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో కలిసి సరూర్‌నగర్ ఎస్ఐ మారయ్యకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గౌతం నగర్ కాలనీ అధ్యక్షుడు కళ్లెం మధుసూదన్‌రెడ్డి, న్యూ గడ్డిఅన్నారం అధ్యక్షుడు రఘు తో కలిసి కార్పొరేటర్ బద్దం ప్రేం మాట్లాడుతూ.. రాత్రి సమయాల్లో గత కొన్ని రోజులుగా కొందరు ద్విచక్ర వాహనాలపై వచ్చి వాటర్ సంపుపై ఉన్న మూతలను చోరీ చేస్తున్నారని, అంతే కాక పరిసరాల్లోని హాస్టళ్లకు చెందిన యువతీ యువకులు మందు బాటిళ్లతో వచ్చి న్యూసెన్స్ చేస్తున్నారని, కాలనీవాసులకు రక్షణ కల్పించాలని కోరారు. స్పందించిన ఎస్ఐ మారయ్య పెట్రోలింగ్ పెంచి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి నట్లు తెలిపారు.

పత్తిపంట ధ్వంసం

అడవి పందులు సంచరిస్తున్నా యంటున్న రైతు

నష్టపోయిన పంటను చూపిస్తున్న రైతు

యాచారం, ఆగస్టు 23 : మండలంలోని మల్కీజ్‌గూడ గ్రామంలో అడవి పందులు బీభత్సం సృష్టించాయి. గురువారం అర్ధరాత్రి పత్తి పంటపై విరుచుకుపడడంతో పత్తి చేను ధ్వంసమైంది. దీనికి సంబంధించి బాధితుడి కథనం ప్రకారం కడ్తాల మండలం పల్లెచెల్కతండాకు చెందిన విస్తావత్ శంకర్ మండలంలోని మల్కీజ్‌గూడలో భూమిని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. ఇందులో పత్తిపంటను సాగు చేయగా, పంట ఏపుగా పెరిగిందని తెలిపాడు. కానీ, అడవి పందులు గుంపులుగా పంటలోకి చొరబడి పంటంతా ధ్వంసం చేశాయని ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారులు పందుల బెడదనుంచి పంటలను కాపాడాలని, పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరాడు.

ఎంసీపీ రీవాల్యుయేషన్ ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 23: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంసీపీ పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంసీఏ (సీబీసీఎస్) కోర్సుతో పాటు దూరవిద్య ద్వారా అందించే ఎంసీఏ కోర్సు పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాలను వి డుదల చేసినట్లు చెప్పారు. ఫలితాలను www. osmania. ac.inలో అం దుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

బ్యాచ్‌లర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ పరీక్ష తేదీల ఖరారు

ఓయూ పరిధిలోని బ్యాచ్‌లర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు కంట్రోలర్ ఆఫ్